బెస్ట్ ఆఫ్ లక్..

- నేటి నుంచి 'పది' పరీక్షలు షురూ
- జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య 6238
- జిల్లాలో 41 పరీక్ష కేంద్రాలు

జనగామ చౌరస్తా, మార్చి 20 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జనగామ జిల్లాలో శుక్రవారం (నేటి) నుంచి షురూ కానున్నాయి. మార్చి 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రమేశ్ తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 6238 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఇందులో 2996 మంది బాలురు, 3242 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పలు కారణాలతో పరీక్ష సమయం కన్నా ఐదు నిమిషాలు ఆలస్యంగా (9.35 గంటలు) వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఆ తర్వాత వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతించమని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తుతో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహణకు 41 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 41 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, 41 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 8మంది కస్టోడియన్లు, 350మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా పరీక్ష సమయంలో విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా ఉండడానికి రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ద్రావణం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురవకుండా ఉండడానికి వారి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కంట్రోల్ రూమ్ 6304062768ను సంప్రదించాలని సూచించారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మార్చి 20 : జిల్లా ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి కలెక్టర్ వడదెబ్బ, తాగు-సాగు నీరు, ఉపాధిహామీ పనులు, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను వసూళ్లు, ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో చివరి ఆయకట్టు వరకు రైతులకు అవసరమైన సాగునీరు అందించాలన్నారు. ప్రజలకు అవసరమైన సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు మార్కింగ్ విధానాన్ని సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధిహామీ కూలీలకు వంద రోజుల పని దినాలు ఖచ్చితంగా కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 97శాతం ఆస్తి పన్నులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. వడ దెబ్బ తగలకుండా

వేసవి జాగ్రత్తలపై వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల ప్రచార వాల్ పోస్టర్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా దంపతులు, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, డీఏవో రామారావునాయక్, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రావు, ఏసీపీలు భీంశర్మ, నర్సయ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు కార్డుకు ఆధార్ కార్డు జత

ఓటరు కార్డుకు ఆధార్ కార్డును జత చేసే ప్రక్రియ నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18ఏళ్ల పైబడిన యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 865 పోలింగ్ కేంద్రాల్లో బూత్‌ల వారీగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లను నియమించాలన్నారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారితోపాటు ఓటరు లిస్టులో పేర్లు, అడ్రస్ వంటి వివరాల మార్పులు, చేర్పులకు సంబంధించి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి 13,104 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో మన్సూరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం ప్రతినిధులు రావెల రవి, భాస్కర్, విజయ్ భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

రూ.20వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ఏసీబీ అధికారులకు చిక్కిన సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, ప్రైవేట్ అటెండర్ రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20 : స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గురువారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఖమ్మం జిల్లాకు చెందిన పర్వతం రామకృష్ణ జనగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి, నాలుగు నెలల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టాడు. కాగా, చిల్పూరు మండలం వెంకటేశ్వర్‌రావుపల్లికి చెందిన గబ్బెట యాదగిరి తన 585 గజాల ఇంటి స్థలంతోపాటు ఇంటిని తన ఇద్దరు కొడుకులు ధర్మరాజు, శివరాజుకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో యాదగిరి కొడుకు శివరాజు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ విషయమై సబ్ రిజిస్ట్రార్‌ను సోమవారం కలువగా, ఇద్దరి పేరుపై చేయడం కుదరదని, ఒక్కరి పేరుపైనే చేస్తానని చెప్పాడు. మేం ఇద్దరం కొడుకులం.., ఇద్దరికి చేయాలని శివరాజు కోరగా రూ.22 వేలు ఖర్చవుతుందని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చెప్పాడు. రూ.20వేలకు ఇచ్చేందుకు శివరాజు అంగీకరించాడు. అయితే, లంచం ఇవ్వడం ఇష్టం లేని శివరాజు మంగళవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించి తన బాధను వివరించాడు. గురువారం శివరాజు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వెళ్లాడు. ప్రైవేట్ అటెండర్ ఏదునూరి రమేశ్‌కు రూ.20వేలు ఇవ్వాలని చెప్పడంతో శివరాజు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. ఇద్దరిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరికి ఎలాంటి లంచాలు ఇవ్వొద్దని, ఎవరు లంచం అడిగినా ఏసీబీ అధికారులను ఆశ్రయించాలన్నారు. ఈ దాడుల్లో సీఐలు సట్ల రాజు, ఎల్ రాజు పాల్గొన్నారు. కాగా, సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న పర్వతం రామకృష్ణ రోజువారి ఆదాయం రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రతి డాక్యుమెంట్‌కు రూ.5 నుంచి రూ.6వేల వరకు లంచం తీసుకుంటాడని, గిఫ్ట్ రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్‌కు సుమారు రూ.పదివేల వరకు డిమాండ్ చేస్తాడని తెలిపారు. మూడు వందల గజాలకు పైగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రూ. పదివేలకు పైగా లంచం తీసుకునే వాడని వారు తెలిపారు.

రాములోరి కల్యాణానికి సౌకర్యాలు కల్పించాలి

పాలకుర్తి, మార్చి 20 : దక్షిణ అయోధ్యగా పేరొందిన వల్మిడి రాములోరి కల్యాణానికి భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వల్మిడి సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన జరిగే సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా జరపాలన్నారు. భక్తులకు తాగు నీరు, విద్యుత్ సౌకర్యం నిరంతరం అందించాలన్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యతగా ఉండాలన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, డీఈఈలు కూనమల్ల సంధ్యా, ఎఫ్ఎల్ చారి, ఈవో ఎస్ మోహన్‌బాబు, కొత్తపల్లి వెంకటయ్య, డాక్టర్ సిద్ధార్థరెడ్డి, ప్రశాంతి, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, బీ సంతోష్‌రెడ్డి, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, శ్రీరాములు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ రణధీర్‌రావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ

బచ్చన్నపేట, మార్చి 20 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జ్యోతి అంజమ్మ(72) రోజు మాదిరిగానే ఇంట్లోకి మిషన్‌భగీరథ నీళ్లు వచ్చాయి. సంప్ నిండడంతో మోటర్ ఆఫ్ చేయబోగా ప్రమాదవశాత్తు వైర్లు పైన పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. చిన్న కుమారుడు భాస్కర్ ఇంట్లోకి వచ్చే సరికే కిందపడి పోయి మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు జ్యోతి భైరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కాగా మృతదేహాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నూకల బాల్‌రెడ్డి, వెంకటాచారీ, జంగిటి విద్యానాథ్, బాలరాజు, కరుణాకర్‌రెడ్డి, ఎండీ మసూద్, నరెడ్ల బాల్‌రెడ్డి, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, పెద్దపాటి కరుణాకర్‌రెడ్డి, పాకాల కరుణాకర్, శ్రీనివాస్, హరినాథ్, రాములు, పరమేశ్, ఎక్బాల్, నర్సిములు, దండ్యాల కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, పెండెం నాగేశ్, నర్సిములు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

హార్వెస్టర్ కింద పడి ఒకరికి తీవ్ర గాయాలు

దేవరుప్పుల, మార్చి 20 : దేవరుప్పుల హైలెవల్ వంతెనపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హార్వెస్టర్ కింద పడి గ్రామానికి చెందిన తోటకూరి యాదయ్యకు తీవ్రగాయాలయ్యాయి. తోటకూరి యాదయ్య సైకిల్‌పై బస్టాండ్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ ఢీకొట్టడంతో యాదయ్య టైర్‌కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో యాదయ్య రెండు కాళ్లు పలు చోట్ల విరిగినట్టు ఆయన కుమారుడు రాంచందర్ తెలిపాడు. చికిత్స నిమిత్తం యాదయ్యను హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించినట్లు ఆయన తెలిపారు.

దాసు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

చిల్పూరు, మార్చి 20 : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అరూరి దాసు అనారోగ్యంతో మృతి చెందాడు. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గురువారం దాసు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అరూరి స్వామి, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ చిర్ర రాజు, రాజవరం మాజీ ఎంపీటీసీ ఎడ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ చిల్పూరు మండల యూత్ ఉపాధ్యక్షుడు అరూరి రవిచంద్రర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

జనగామ చౌరస్తా, మార్చి 20 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనగామ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో వివేకనంద సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి విక్రమ్ హాజరై మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులకు సహజ సిద్ధంగా తయారు చేసిన చేతి సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకనంద సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్, స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఎండబట్ల శ్రీనివాస్, అడ్వొకేట్ మంచాల రవీందర్, అన్నబోయిన సత్యం, ఉపాధ్యాయులు లక్ష్మి, కొయ్యడ దస్తగిరి, మంజుల, భాస్కర్, కనకయ్య, సఫియా, ఎండీ దస్తగిర్, సుశీల, శ్యామల పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

జఫర్‌గఢ్, మార్చి 20 : ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ పోరాటం, అమరుల త్యాగ ఫలితమే రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఆ సంస్థ జనగామ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అన్నారు. గురువారం జఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా, మండల నాయకులు రడపాక ఆదాం, మహేశ్, కలకోటి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల ఏలియా, మరపల్లి రవి, నేరెళ్ల రాజు, మాజీ సర్పంచ్ గాదెపాక చిరంజీవి, తాటికాయల రాజేందర్ పాల్గొన్నారు.

జనగామ జిల్లా పేరు మార్చొద్దు : జేఏసీ

జనగామ చౌరస్తా, మార్చి 20 : జనగామ జిల్లా పేరు ఎట్టి పరిస్థితుల్లో మార్చొద్దని జేఏసీ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ జనగామ గడ్డపై పాల్కూరికి సోమనాథుడు, బమ్మెర పోతన, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, నల్ల నర్సింహులు, చుక్క సత్తయ్య వంటి గొప్ప మహనీయులు పుట్టినట్లు తెలిపారు. జనగామ అనేది ఒక చారిత్రక నేపథ్యం కలిగి ఉండి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే పేరు అని పేర్కొన్నారు. అలాంటి పేరును మార్చే ఉద్యమాలు ఏ కుల సంఘాలు కూడా చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా పేరు మార్పు చర్యలు చేపట్టొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల సురేశ్, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుభాష్, వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్, అజయ్, ఇమ్రాన్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

లింగాలఘనపురం, మార్చి 20 : మండలంలోని నవాబుపేటలో ఓ వ్యక్తి అనారోగ్యానికి గురి కాగా, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. యాసోజు శ్రీనివాస్ పక్షవాతంతో అనారోగ్యానికి గురై ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న గుడి వంశీధర్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ శావకుమార్, బొల్లంపెల్లి నాగేందర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు 'ఎర్రబెల్లి' పరామర్శ

బొడిగె సోమ్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

పాలకుర్తి, మార్చి 20 : లక్ష్మీనారాయణపురం మాజీ ఉప సర్పంచ్ బొడిగే ప్రదీప్ తాత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొడిగె సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం సోమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ సోమయ్య మృతి బాధాకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. సోమయ్య కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గూడూరు శివారు జానకీపురంలో రోడ్డు ప్రమాదంలో గడ్డం పెద్ద యాకయ్య మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇల్లందుల ఉప్పలమ్మ, పూజారి జంపయ్య తల్లి సోమక్క, గుగ్గిళ్ల కొంరయ్య భార్య కొంరమ్మ కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, మల్యాల పరశురాములు, గుండెవేని శ్రీకాంత్, గిలకత్తుల శంకరయ్య, అశోక్, పోగు రుషేంద్రం, పోగు వాసుదేవ్, గిలకత్తుల కొంరయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, వడ్లకొండ అండాలు, చెరిపెల్లి విజయ్‌కుమార్, గుగ్గిళ్ల రామస్వామి, పులి ఐలోని, అశోక్ ఉన్నారు.

రూ.50వేలు నష్టపరిహారం అందించాలి

ఓబులాపురంలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్, మార్చి 20 : సాగునీటి సమస్యతో ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఓబులాపురం గ్రామంలో ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పుర వీధుల గుండా ర్యాలీ, ఎండిన పంటల సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా మాట్లాడుతూ పంటలు చేతికి వచ్చే సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం పంట నష్టంపై సర్వే చేసి, ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. దేవాదుల ద్వారా చెరువులు, కుంటలను నింపాలని, ఉప్పుగల్లు నుంచి పాలకుర్తి రిజర్వాయర్ మెయిన్ కెనాల్, పాలకుర్తి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ రూ.500 రానివారికి వెంటనే అందించాలని వారు డిమాండ్ చేశారు.

రైతు హామీలు తుంగలో తొక్కే బడ్జెట్

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందూనాయక్



భూక్యా చందూనాయక్

జనగామ, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేవిధంగా బడ్జెట్ లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ అభిప్రాయపడుతున్నది. బడ్జెట్‌ను సవరించి రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందూనాయక్ డిమాండ్ చేశారు. 2025-26లో వ్యవసాయ రంగానికి రూ.18,101 కోట్లు, పశు సంవర్ధనకు రూ.1,657 కోట్లు, సహకార రంగానికి రూ.158కోట్లు, అడవుల పెంపకానికి రూ.1,022 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.23,330 కోట్లు కేటాయించారని తెలిపారు. గత సంవత్సరం వ్యవసాయ రంగానికి మాత్రమే రూ.33,493 కోట్లు కేటాయింపు చేశారన్నారు. ప్రస్తుత బడ్జెట్ రుణమాఫీ కాని రైతులకు ఇక మాఫీ అయ్యే అవకాశం లేదని స్పష్టం అవుతుందన్నారు. కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనేలేదన్నారు. రుణమాఫీ కాని రైతులందరికీ రుణమాఫీ చేయాలని, నాణ్యతలేని, కల్తీ విత్తన వ్యాపారాన్ని అడ్డుకొని నాణ్యత గల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించే విధంగా నిధులు కేటాయించాలన్నారు. యేటా రూ.4,500ల కోట్లు విలువ గల పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోతుంటే రైతుల బీమాకు మాత్రం రూ.1,167.92కోట్లు మాత్రమే కేటాయించారని, రైతు బీమా పథకాన్ని 18-59 సంవత్సరాలను 18-65 సంవత్సరాలకు పెంచాలన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఊసేలేదు..

కొత్తపల్లి అభినాష్, తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కొత్తపల్లి అభినాష్

జనగామ, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు 2025-26 బడ్జెట్‌లో రూ.150కోట్లు, ఉచిత విద్యుత్ పథకానికి రూ.100 కోట్ల, సంక్షేమ చర్యలకు సంబంధించి రూ. 50 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఊసేలేదని తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అభినాష్ ఆందోళన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారులకు మండలానికో వృత్తి బజార్ల కాంప్లెక్స్, సేవాకులాల సహకార సంఘాలకు రూ.10లక్షల ఆర్థిక సాయానికి నిధులు కేటాయించలేదని, నవీన సెలూన్ల నిర్మాణం సహా, నాయీ బ్రాహ్మణ సహకార సంఘాలకు ప్రత్యేక రుణాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు.

ఘనంగా థాను నాయక్ వర్ధంతి



కొడకండ్ల : థాను నాయక్‌కు నివాళులర్పిస్తున్న గిరిజనులు

జనగామ చౌరస్తా/కొడకండ్ల, మార్చి 20 : భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విప్లవ ధృవ తారగా కీర్తి గడించిన యోధుడు జాటోత్ థాను నాయక్ 75వ వర్ధంతి వేడుకలు గురువారం జనగామ జిల్లాలో ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సేవాలాల్ సేన ఆధ్వర్యంలో థాను నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధరావత్ శంకర్‌నాయక్, రమేశ్‌నాయక్, ప్రశాంత్, సుమన్, నవీన్, చంద్రశేఖర్, మల్లేశ్, రామన్న, రాజు, నరేశ్ పాల్గొన్నారు. కొడకండ్ల మండలంలోని గిర్నతండాలో మాజీ జీసీసీ చైర్మన్ గాంధీనాయక్ ఆధ్వర్యంలో థాను నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ధరావత్ జ్యోతి, గిరిజన నాయకులు నరేశ్‌నాయక్, వెంకన్న నాయక్, రాజన్ననాయక్, రాజ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చివరి రోజు 98.01 హాజరు శాతం నమోదు

జనగామ చౌరస్తా, మార్చి 20 : ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ థియరీ వార్షిక పరీక్షలు గురువారం జనగామ జిల్లాలో విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు జిల్లాలోని 17పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 3814 మంది హాజరుకావాల్సి ఉండగా, 3738 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్, డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. 76మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 98.01 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు.

ఇఫ్తార్ ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష

పాలకుర్తి, మార్చి 20 : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ దావత్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏటా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తోందన్నారు. ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్, ఆర్ఐ రాకేశ్, ముస్లిం పెద్దలు ఎండీ మదార్, సలీం, సలాం, సైదులు, అజాం, నజీర్, హమీద్ పాల్గొన్నారు.

కార్మిక ప్రయోజనాలకు విరుద్ధంగా బడ్జెట్

జఫర్‌గఢ్, మార్చి 20 : రాష్ట్ర బడ్జెట్ కార్మిక ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని సీఐటీయూ జనగామ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు అన్నారు. గురువారం జఫర్‌గఢ్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలు పేర్కొన్న కార్మిక సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కోటి యాభై లక్షల మంది కార్మికులకు బడ్జెట్‌లో కేవలం రూ.900కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం నిరుత్సాహపర్చిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను అన్ని వర్గాలకు మేలు చేసేలా సవరించాలని డిమాండ్ చేశారు.

పశు సంపదతోనే ఆర్థికాభివృద్ధి

పాలకుర్తి, మార్చి 20 : పశు సంపదతోనే రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జనగామ జిల్లా జడ్జీ ఎస్ రవీంద్రశర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో శ్రీ గౌరీ గోశాల ఆధ్వర్యంలో 62గోవులను రవీంద్ర శర్మ చేతుల మీదుగా రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రశర్మ మాట్లాడుతూ గోవులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి రమేశ్‌శర్మ, ఎస్సై దూలం పవన్‌కుమార్, యాకూబ్ హుస్సేన్, బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్, ప్రధాన కార్యదర్శి వెల్పుల దేవరాజు, దుంపల సంపత్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన 'కడియం'



చిల్పూరులో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి/లింగాలఘనపురం/చిల్పూరు, మార్చి 20 : రఘునాథపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రైతు వేదికలో గురువారం స్టేషనఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి చెందిన 32మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.32,03,712ల విలువ గల చెక్కులను, అలాగే 40 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.16,74,500 విలువగల చెక్కులను అందజేశారు. అలాలే లింగాలఘనపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.39,04,524 విలువైన చెక్కులను, 43 మందికి రూ.17,55,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం అందించారు. చిల్పూరు మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో మండలానికి సంబంధించిన 49మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.49,05,684ల విలువ గల చెక్కులను, అలాగే, 49మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.17,33,500ల విలువగల చెక్కులను ఆయన అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కడియం శ్రీహరి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిశీలించి ప్రభుత్వ ఆర్థిక సాయం అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. రఘునాథపల్లిలో గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, తహసీల్దార్ మోహ్సిన్, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, నాయకులు కోళ్ల రవిగౌడ్, ఎండీ భాషుమియా, మల్కపురం లక్ష్మయ్య, అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. లింగాలఘనపురంలో ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, పోకల శంకరయ్య, గోసంగి కిష్టయ్య, ఏసీపీ భీంశర్మ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రావన్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ శివకుమార్, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, శ్రీలతారెడ్డి, బోయిని రాజు, బెజ్జం ఆంజనేయులు , పోరెడ్డి మల్లారెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, వేమల్ల లింగారెడ్డి పాల్గొన్నారు. చిల్పూరు తహసీల్దార్ సరస్వతి, ఎంఆర్ఐ వినీత్‌కుమార్, చిల్పూరు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, దేవస్థానం డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, రత్నాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్, యూత్ అధ్యక్షుడు విజయ్, నాయకులు రంజిత్ రెడ్డి, సమ్మయ్య, బాలరాజు, షకీల్, రాజు పాల్గొన్నారు.



జనగామ అర్బన్ పీఎస్‌కు బారికేడ్లు వితరణ చేస్తున్న డాక్టర్లు

ట్రాఫిక్ నివారణకు బారికేడ్స్ వితరణ

జనగామ చౌరస్తా, మార్చి 20 : జనగామ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు రూ.25 వేల విలువ గల ఐదు బారికేడ్లను అర్బన్ పీఎస్‌కు వితరణ చేసినట్లు స్థానిక మను మెటర్నిటీ జనరల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వంశీ, డాక్టర్ పృథ్వీ తెలిపారు. జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు ట్రాఫిక్ సమస్యలకు గురి కావొద్దని భావించి బారికేడ్లను అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజేశ్‌కుమార్, చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్
★ గోపాలపురం (HNK), 0% వడ్డీతో సులభ వాయిదాలతో సొంత ఇంటి కలను సాకారం చేసుకోండి. KUDA Approved గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్ (2BHK) సెల్: 6305185315.
NTW-000

CHANGE OF NAME
★ I, SURESHKUMAR CHANCHAL (New Name), W/o. Vardelli Shravan Kumar, R/o. 15-6/1, Opp. Forest Office, Narsampet, Warangal, Rural, Pin-506 132, TS, have Changed My Name from CHANCHAL VARDELLI to SURESHKUMAR CHANCHAL for all purposes.
NT-330915

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

CHANGE OF NAME
I Dhumala Srujana, W/o. Dhumala Ramesh, H.No.1-36. Mallampally Village and Mandal, Mulugu Dist. My son name and Surname Changed from DUMALA MEGHANATH to DHUMALA MYTHRINATH S/o Dhumala Ramesh for all purposes.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565